క్లుప్తంగా

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి



అంగన్‌వాడీ కార్యకర్తకు సూచనలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు సక్రమంగా అందించాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. దేవుపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. హాజరు పట్టికను పరిశీలించి, కేంద్రంలో పూర్తిస్థాయిలో చిన్నారులు ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున చిన్నారులను కేంద్రం నుంచి బయటకు విడిచిపెట్ట వద్దని, రోజూ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు.

ఎం.కొత్తవలసలో వైద్య శిబిరం



సేవలందిస్తున్న వైద్యాధికారి పుష్పాంజలి

గజపతినగరం: జగనన్న ఆరోగ్య సురక్ష–2లో భాగంగా మండలంలోని ఎం.కొత్తవలస గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 367 మందికి వైద్య సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేశారు. శస్త్రచికిత్సలు, మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి, ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. అలాగే అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన



నెలివాడ గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ కె.లక్ష్మణరావు సూచించారు. మండలంలోని నెలివాడలో గ్రామస్తులకు ఎన్నికల కోడ్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహించకూడదని, పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని చెప్పారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు మద్యం,డబ్బుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో డీఎంహెచ్‌ఓ తనిఖీలు



గరివిడిలో వైద్య సిబ్బందితో సమావేశమైన డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు, గరివిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ) ఎస్. భాస్కరరావు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. సిబ్బందితో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ సక్రమంగా విధులు నిర్వర్తించాలని, విధుల్లో అలసత్వం వహిస్తూ సహించేది లేదని అన్నారు. ఆరోగ్యకార్యక్రమాలకు సంబంధించిన లక్ష్యాలను శతశాతం చేరుకోవాలని ఆదేశించారు. ఈహెచ్‌ఆర్ లాగిన్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(ఏబీహెచ్‌ఏ) అప్‌లోడింగ్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వైద్యాధికారులు ఎస్.దీప్తి, కె.రాజ్యలక్ష్మి, సీహెచ్‌ఓ ఏ.సత్యంనాయుడు ఆయన వెంట ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: మండలంలోని మోపాడ వద్ద ఉన్న కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ప్రథమ ఇంటర్, ఆరో తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.భవాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 11వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆధ్యాత్మిక సందడి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట పంచాయతీ సువ్వానిపేటలో కొత్తగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. రెండు రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేద పండితుల ఆధ్వర్యంలో విశేష హోమాలు, పూజలు చేపట్టడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

- పేదలకు ఆర్థిక భరోసా కల్పించాం
- గడప గడపకూ సంక్షేమం అందించాం
- పార్టీ విజయానికి సమష్టిగా కృషిచేయాలి
- మేలు జరిగితేనే ఓటు వేయండని ప్రజలను కోరండి
- వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో మంత్రి బొత్స



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

వేపాడ: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు రాష్ట్రంలో పేద బడుగు, బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి ఎంతో దోహదపడ్డా యని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి ఆయన సమప్రాధాన్యం ఇచ్చారని, ఈ సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగనే మళ్లీ సీఎం కావాలిసిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్య నారాయణ అన్నారు. కొత్త వలసలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు క్యాంపు ఆఫీస్‌లో ఎమ్మెల్యే నేతృత్వం లో వైఎస్సార్‌సీపీ వేపాడ మండల విస్తృతస్థాయి సమావేశం శనివారం నిర్వ హించారు. అతిథిగా హాజరైన మంత్రి బొత్స మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అంతా కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. పార్టీలకతీతంగా, పారదర్శకంగా, రూపాయి అవినీతికి తావులేకుండా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌దేనని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమ లు చేసిన న్ని పథకాలను దేశం లో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదని, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకువచ్చామని చెప్పారు. విద్య, వైద్యరంగా ల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని వివరించారు. మీ ఇంటికి మేలు జరిగిందని మీకు అనిపిస్తేనే మాకు ఓటు వేయండని ప్రజలను ధైర్యంగా అడిగే ఏకైక నాయకుడు మన ముఖ్య మంత్రి జగన్ మాత్రమేనని అన్నారు. ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని గ్రామాల్లో ప్రజలకు వివరించి ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్న కడుబండి శ్రీనివాసరావును, విశా ఖపట్నం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్న బొత్స ఝాన్సీలక్ష్మిని అధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషిచేయాలని పార్టీ శ్రేణులను కోరారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్య మంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతీ నాయకుడు, కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటువేయాలని ప్రచారం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న బొత్స కుటుంబం బరుణం తీర్చుకోవాల్సిన సమయం వచ్చిందన్నారు. మండల, గ్రామస్థాయి నాయకులు, బూత్ కమిటీ సభ్యులు ప్రతీ ఓటరును కలిసి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరించాలని చెప్పారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్, ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కసూరీ, ఎస్.కోట నియోజకవర్గంలోని అయిదు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ మండల కన్వీనర్లు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బూత్‌కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

చేసిన మంచిని వివరించండి



మాట్లాడుతున్న జైహింద్‌కుమార్

గంట్యాడ: పథకాల రూపంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ మేలు జరిగిందని జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. మండలం లోని రావివలస, మురపాక గ్రామాల్లో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.3 వేల పింఛన్ అందిస్తోందని, ఈ డబ్బులను వలంటీర్లు ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇస్తున్నారని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ సచివాలయాల ద్వారా గ్రామాల్లోనే అందుతున్నాయని, అవినీతి రహిత సంక్షేమ పాలన అందిస్తున్నామని, ఇవన్నీ ప్రజలకు వివరించాలని దిశా నిర్దేశం చేశారు. ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు జేసీఎస్ కన్వీనర్ రామసూర్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, మురపాక సర్పంచ్ ఈదుబిల్లి రమేష్‌కుమార్, నాయకులు ఎం.నారాయణమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంధనం పొదుపుగా వినియోగించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న మోడల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

వేపాడ: ఇంధన వనరులను పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండలంలోని బక్కునాయుడుపేట మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్. రమణమూర్తి అన్నారు. ఇంధన శక్తి పరిరక్షణపై ఆ పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ వనరుల ల భ్యత తగ్గుముఖం పడుతున్న వేళ దేశ ఆర్థిక ప్రగతికి ప్రధాన మూలమైన విద్యుత్‌ను ఆదా చేయాల్సిన అవసరం ఉందన్నారు. అవసరం మేరకే వాహనాలను, విద్యుత్‌ను ఉపయోగించాలన్నారు. అనంతరం రాయుడిపేటలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ



ఉపాధ్యాయులకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనీలు

శృంగవరపుకోట: ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల కమిషన్ సూచించిన ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసు కుని, విధులు నిర్వర్తించాలని మాస్టర్ ట్రైనీలు ఎలక్షన్ ట్రెనింగ్ క్యాంప్‌లో ఉపాధ్యాయులకు సూచించారు. స్థాని క ప్రభుత్వ జూనియర్ కళా శాలలో 2వ బ్యాచ్‌కు తొలి విడత శిక్షణ శనివారం నిర్వహిం చారు. సుమారు 400 మంది ఉపాధ్యాయులకు మాస్టర్‌ట్రైనీలు శిక్షణ ఇచ్చారు. సాధారణ విధులు, పీఓ అధికారాలు, బాధ్యతలు, 17సీ రిజిస్టర్ నిర్వహణ, మాక్‌పోల్ నిర్వహణ, పోలింగ్ వేళలో తీసుకోవాలిసిన జాగ్రత్తలు, చా లెంజ్ ఓట్, టెండర్ ఓట్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్, బ్యాలెట్ యూనిట్‌ల గురించి వివరించారు. తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కె. భరత్‌కుమార్ పాల్గొన్నారు.

4వ తేదీ నుంచి సదరం స్లాట్ బుకింగ్‌లు

బొండపల్లి: సదరం స్లాట్ బుకింగ్‌లు ఏప్రిల్ 4వ తేదీ నుంచి సచివాలయాలతో పాటు మీసేవా కేంద్రాల్లో ప్రారంభం కానున్నాయని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్,మే,జూన్ నెలలకు సంబంధించి సదరం స్లాట్‌లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు భద్రకాళి, మజ్జిగౌరి జాతర

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత వద్ద భద్రకాళి, మజ్జిగౌరి అమ్మవార్ల ఆలయం వద్ద ఆదివారం జాతర నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి శనివారం తెలిపారు. తెల్లవారు జామున ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతిం చనున్నట్లు పేర్కొన్నారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

దరఖాస్తులకు గడువు పెంపు

వేపాడ: బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 6 వరకు పొడిగించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్.రమణమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివ రాలకు పాఠశాలలో పనివేళలో సంప్రదించాలని సూచించారు.

కొప్పలవెలమలకు అన్యాయం..

- కొప్పల వెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పరదేశినాయుడు

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్‌సీపీ మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీలు కొప్పల వెలమలకు అన్యాయం చేశాయని కొప్పల వెలమ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కిలపర్తి పరదేశినాయుడు అన్నారు. కామాక్షినగర్‌లోని వెలమభవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి విజయనగరం జిల్లాలో కొప్పల వెలమలకు ఒక్క ఎమ్మెల్యే సీటు గాని, ఎంపీ సీటు గాని కేటాయించకుండా టీడీపీ కూటమి మోసం చేసిందన్నారు. బీ–ఫారం ఇవ్వడానికి ఇంకా సమయం ఉన్నందున ఇప్పటికైనా వెలమలకు ఎమ్మెల్యే, ఎంపీ సీటు కేటాయించాలని కోరారు. లేని ఎడల తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. సమావేశంలో కొప్పల వెలమ సంఘ జిల్లా అధ్యక్షుడు బొత్స వరప్రసాద్, జిల్లా కార్యదర్శి తెంటు కాశినాయుడు, అధికార ప్రతినిధి మేకావు శ్రీహరినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు బోకం కుమార్, గుణుపూరు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో...



జాకేరు రైతుభరోసాకేంద్రం

- జాకేరు సచివాలయం పరిధిలో రూ.93 లక్షలతో భవనాల నిర్మాణం
- రూ.23 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం
- రూ.16.70 లక్షలతో పాఠశాలలో నాడు–నేడు పనులు
- పథకాల రూపంలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) విధానంలో ప్రజలకు చేకూరిన లబ్ధి రూ.15.14 కోట్లు
- పథకాల ద్వారా పరోక్ష (నాన్ డీబీటీ) విధానంలో చేసిన ఖర్చు రూ.4.24 కోట్లు



జాకేరులోని ఓ వీధిలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



గ్రామ సచివాలయ భవనం



వెల్‌నెస్ కేంద్రం భవనం



కరకవలసలో నిర్మించిన సీసీ రోడ్డు



జాకేరులో నిర్మించిన సామాజిక భవనం

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామం అభివృద్ధి బాటలో పయనిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థతో జాకేరు రూపురేఖలు మారాయి. జాకేరుతో పాటు కరకవలస, గుడి వాడ పంచా యతీలను కలిపి జాకేరులో సచివాలయం ఏర్పాటు చేశారు. రూ.40 లక్షలతో సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో రైతుభరోసా కేంద్రం(ఆర్బీకే), రూ.17.50 లక్షలతో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను, రూ.4.50 లక్షలతో సామాజిక భవనాన్ని నిర్మించారు. జిల్లాలో ప్రప్రథమంగా జాకేరులోనే గ్రామ సచివాలయం, ఆర్బీకే, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల భవన నిర్మాణాలను పూర్తిచేశారు. జాకేరులో రూ.15 లక్షలతో సీసీ రోడ్లు కాలువలు, రూ. 3లక్షలతో కమ్యూనిటీ మరుగుదొడ్లు, రూ.5 లక్షలతో తాగునీటి బోర్లు నాలుగు ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలో సొంత స్థలాలు ఉన్న 23 మందికి ఇళ్లు, అలాగే మరో మూడు కుటుంబాలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేసి, నిర్మాణాలకు బిల్లులు అందజేశారు. మన బడి నాడు–నేడు పథకంలో భాగంగా ఎంపీ యూపీ స్కూల్‌లో రూ.16.70 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. అలాగే కరకవలసలో రూ.8లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించారు. సచివాలయం పరిధిలోని ప్రజలకు వివిధ పథకాల ద్వారా ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో రూ.15,13,21,960 లబ్ధిచేకూరింది. పథకాల ద్వారా సచివాలయ పరిధి ప్రజలపై పరోక్షంగా రూ.4,24,72,150 ప్రభుత్వం ఖర్చు చేసింది. మండల కేంద్రానికి వెళ్లాల్సిన పనిలేకుండా ప్రజలకు ప్రభుత్వ సేవలు, రైతులకు విత్తనాలు,ఎరువులు గ్రామంలోనే అందుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మాక్ పోలింగ్ తప్పనిసరి

- ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలి
- అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్ నాగలక్ష్మి



ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు ఉదయం 5.45 గంటలకు మాక్ పోలింగ్‌ను తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక గురుకుల పాఠశాలలో పీఓలు, ఏపీఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది విధులు, బాధ్యతలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. గత ఎన్నికలకు ఈ ఏడాది ఎన్నికలకు నిబంధనలు మారాయన్నారు. వాటిని అనుసరించి ఎక్కడా పొరపాట్లు రాకుండా, రీపోలింగ్‌కు తావివ్వకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పొరపాట్లు, తప్పులకు అవకాశం ఇస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ ప్రక్రియ జోరుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు బూత్‌లోకి వెళ్లి ఓటు వేసి వచ్చేందుకు 7 సెకన్ల సమయం పడుతుందని, అందుకు అనుగుణంగా ఇతర పనులను పూర్తి చేసుకోవాలన్నారు. మాక్ పోలింగ్ జరగకపోతే పోలింగ్ రద్దయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతీ పోలింగ్ సెంటర్‌లో పీఓతో పాటు నలుగురు సిబ్బంది ఉంటారన్నారు. సిబ్బంది అందరికీ మూడు విడతల శిక్షణ ఉంటుందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఆర్డీఓ ఎ.సాయిశ్రీ, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలే పశువులకు శ్రీరామరక్ష



మర్రివలసలో గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

రామభద్రపురం: పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ ఏడీ ఎల్.విష్ణు సూచించారు. వాతావరణంలో మార్పులు మొదలవగానే పశువులు గాలికుంటు వ్యాధి బారినపడే అవకాశం ఉంది. సకాలంలో వ్యాక్సిన్ వేస్తే వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చు. లేకపోతే పశువులు మృత్యువాత పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జీవాలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఉచిత టీకాల కార్యక్రమం చేపట్టింది. ప్రస్తుతం డివిజన్ వ్యాప్తంగా అన్ని పశువైద్యశాలల ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ ముమ్మరంగా సాగుతోంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జీవాలను కాపాడుకోవాలని సూచించారు.

వ్యాధి లక్షణాలు..

- వ్యాధి సోకిన పశువుల నోటి నుంచి చొంగ కారడం.
- 105 డిగ్రీల జ్వరం వస్తుంది. నోట్లో, కాలి గిట్టల్లో పుండ్లు ఏర్పడటం.
- నెల రోజులు వయస్సు దూడలు, ఈ వ్యాధి ఉన్న పశువుల పాలు తాగితే వ్యాధి సోకి మరణించే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన పశువులు ఎక్కువ సేపు ఎండలో ఉండలేవు.
- దుక్కి దున్నే పశువులు కాళ్ల మట్టలు కదిలిపోతాయి. దీంతో అవి పనిచేయలేవు.

నివారణ ఇలా..

వ్యాధి సోకిన వెంటనే పశువులను గుర్తించి గుంపు నుంచి వేరు చేసి విడిగా కట్టేయాలి. ఇలా చేయకపోతే ఇతర పశువులకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. వెంటనే పశువైద్యుడిని సంప్రదించి వైద్యం చేయించాలి. వ్యాధి సోకక ముందు ఎఫ్ఎండీ వ్యాక్సిన్ వేయించాలి. సోకిన తర్వాత పెన్సిలిన్, యాంటీ ఇస్టమిన్, యాంటీ ఇస్టమేటరీ డ్రగ్స్ వాడుతూ నోటిలో, కాలి గిట్టల మధ్య గ్లిజరిన్‌తో శుభ్రం చేసి బోరిక్ పౌడర్ పట్టించాలి. వ్యాధి సోకక ముందే వ్యాక్సిన్ వేయించుకుని జాగ్రత్తపడాలి.

ఘనంగా సింహాద్రి అప్పన్న సంబరాలు

బొబ్బిలి: మండలంలోని కృష్ణాపురంలో సింహాద్రి అప్పన్న సంబరాలను ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ సంబరాల్లో రెడ్డి, చుక్క వారి కుటుంబాలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పన్నెండేళ్లకోసారి జరిగే ఈ సంబరాల్లో కోలా పట్టుకుని నృత్యం చేయడం ప్రత్యేకత. సంబరాల సందర్భంగా బంధువులు, స్నేహితులతో గ్రామం సందడిగా మారింది.

సీహెచ్‌సీలో వైద్యుల నియామకం

బాడంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో గైనకాలజిస్టుగా డాక్టర్ ప్రత్యూష నియమితులయ్యారు. ఇక్కడ గైనకాలజిస్టుగా పనిచేసిన డాక్టర్ అర్చన డీసీఎస్‌గా పదోన్నతిపై చీపురుపల్లి ఆస్పత్రికి బదిలీ అయ్యారు. జనరల్ సీఎస్‌గా పనిచేసిన డాక్టర్ కాశీవిశ్వనాథం సాలూరు సీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. ఆదేవిధంగా కురుపాం ఆస్పత్రి నుంచి ఆర్థోపెడిక్ డాక్టర్ గుణశేఖర్, ఈఎన్‌టీ వైద్యులు ఆషా ఇక్కడకు బదిలీపై వచ్చారు. 50 పడకలతో ఉన్న ఈ ఆస్పత్రిలో ఇంకా జనరల్ సర్జన్, చిన్నపిల్లల వైద్యుడు, కంటి వైద్యులను నియమించాల్సి ఉందని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

చెక్‌పోస్టులు, పోలింగ్ స్టేషన్ల వద్ద పటిష్ట భద్రత



అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద డీఎస్పీ, సీఐలకు సూచనలిస్తున్న ఎస్పీ దీపిక

- ఎస్పీ ఎం.దీపిక

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికలను పటిష్టంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ ఎం దీపిక అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల పాత బొబ్బిలి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శనివారం ఆమె సందర్శించారు. అంతర జిల్లా చెక్ పోస్టులు, పోలింగ్ స్టేషన్ల వద్ద భద్రతా ఏర్పాట్లపై డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఎం.నాగేశ్వరరావుకు పలు సూచనలు చేశారు. మద్యం, నగదు, ఆయుధాలను అక్రమంగా తరలించేవారిపై కఠినంగా వ్యవహరించాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఓటర్లకు బహుమతులు ఇచ్చి ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించేవారిపై కేసుము నమోదు చేయాలన్నారు.

పోలింగ్ స్టేషన్ల తనిఖీ

మండలంలోని మెట్టవలస, పారాది గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను ఎస్పీ దీపిక తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఓటు హక్కు వినియోగించుకునే వారు మినహా ఎవరినీ అనుమతించరాదన్నారు. కేంద్రాల భద్రతకు ఏమేం చర్యలు తీసుకున్నారో డీఎస్పీ, సీఐలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎస్సై జి.లోవరాజు తదితరులున్నారు.



మాట్లాడుతున్న సీఐ నాగేశ్వరరావు

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు

బొబ్బిలి: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అల్లర్లు సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 15వ వార్డు యాదవ వీధిలో శనివారం రాత్రి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకూడదని, ఈసీ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు.

ఎన్నికల ప్రచారాల్లో బాణసంచా కాల్చరాదు

రేగిడి: పార్టీ నాయకులు గ్రామాల్లో ప్రచారానికి వెళ్లే సమయంలో బాణసంచా కాల్చరాదని ఎస్సై ఇ.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా కాల్చితే కేసులు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతీ ఒక్కరూ పాటించాలని కోరారు.